

అమరేశ్వరుని సేవలో ఐజీ

అమరావతి: శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుడిని శుక్రవారం ఐజీ లవకుమార్ దర్శించుకున్నారు. స్వామివారికి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



ఆలయ కలశాలకు అభిషేకం

దుగ్గిరాల: కేఆర్ కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ శిఖర కలశాలు, విగ్రహాలకు ఆవుపాలతో అభిషేకం, హోమం నిర్వహించారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



చిలకలూరిపేట: రజక కాలనీలోని ఈశాన్య ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై శుక్రవారం తిరునక్షత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో 1008వ భగవద్రామానుజాచార్య స్వామి వారి తిరునక్షత్ర మహోత్సవంలో భాగంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, సేవాకాలం, అర్చన కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు వాహన సేవ, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామన్నారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

శాప్ ఆధ్వర్యంలో కబడ్డీ క్యాంప్



వినుకొండ: శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు కబడ్డీ క్యాంప్ స్థానిక కారంపూడి రోడ్డులోని విద్యావికాస్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కోచ్ కోమటిగుంట శ్రీహరి తెలిపారు. ఈ క్యాంప్‌ను శుక్రవారం డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్, పీఈటీ రాధాకృష్ణమూర్తి, వినుకొండ జోన్ ప్రెసిడెంట్ గణప వీరాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8008285430 నంబరులో సంప్రదించాలన్నారు.

యతీశ్వరుల చిత్ర పటాలతో ప్రదర్శన



కొల్లూరు: శంకర జయంతిని పురస్కరించుకుని ఆది శంకరాచార్యులు, రామచంద్రేంద్ర సరస్వతి యతీశ్వరులు చిత్రపటాలతో కొల్లూరులో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. వేద పరీక్షలు, పండిత సన్మాన సభలు శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు కొల్లూరులోని శ్రీ పార్వతీ సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణకు అధ్యక్ష, కార్యదర్శులుగా గబ్బిట శివరామకృష్ణప్రసాద్, తాడేపల్లి వెంకటసింహాద్రిశాస్త్రి వ్యవహరిస్తారన్నారు.

7 నుంచి కళాపరిషత్ నాటిక పోటీలు



పొన్నూరు: పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో బుర్రకథ పితామహుడు పద్మశ్రీ షేక్ నాజర్ శత జయంతిని పురస్కరించుకుని 24వ తెలుగు రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు కళాపరిషత్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 10 వరకు నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై పోటీలు జరుగుతాయన్నారు. ఎస్.అంజనేయులునాయుడు, ఎస్.రఘునాథ్, అకుల సాంబశివరావు, ఎం.విజయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్.దేసిబాబు, మురళీకృష్ణ, జి.తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

అమరావతి: అమరేశ్వరుని దేవస్థానంలో శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శంకరాచార్య విగ్రహానికి ఆలయ అర్చకుడు శంకరమంచి రాజశేఖర శర్మ పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషాలంకారం, ప్రత్యేక పూజలు చేసి బ్రాహ్మణులకు విసన కర్రలు, మామిడి పండ్లు పంపిణీ చేశారు.



కన్ను పడితే కనకం మాయం

ఆ మహిళల కళ్లు నిఘా నేత్రాల్లా పని చేస్తాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికుల చేతుల్లో ఎన్ని బ్యాగులు ఉన్నా..ఏ బ్యాగులో బంగారం ఉందో ఇట్టే కనిపెట్టేస్తాయి. ఆ బంగారాన్ని కాజేసేందుకు అమాయకమైన మాటలే పెట్టుబడి.. వారు చూపించే ప్రేమానురాగాలు ప్రయాణికులను మైమరిపిస్తాయి. వారి కట్టూ బొట్టు ఎక్కడా అనుమానం రానీయకుండా నమ్మకం కలిగిస్తాయి. చివరకు ప్రయాణికుల బంగారం వస్తువులన్నీ మాయమవుతాయి. ఇదీ నరసరావుపేట బస్టాండ్‌లో మహిళా దొంగల ముఠా చేస్తున్న మాయ.

- నరసరావుపేటలో మహిళా దొంగల ముఠా హల్‌చల్
- ప్రయాణికులే లక్ష్యంగా బంగారం చోరీ..బస్టాండ్ ప్రాంతాల్లో మకాం
- తాజాగా ఓ ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు చోరీ
- పోలీసులకు సవాల్‌గా మారిన మహిళా దొంగల ముఠా

నరసరావుపేట టౌన్: రాష్ట్రంలో దొంగతనాలకు చెక్ పెట్టేందుకు పోలీసు యంత్రాంగం సరికొత్త టెక్నాలజీతో ముందుకు సాగుతోంది. అడుగడుగునా సీసీ కెమెరాల నుంచి సైబర్ వ్యవస్థ మరింత పటిష్టం చేస్తూ నేరాల కట్టడికి ప్రయత్నిస్తోంది. అయితే ఎంత టెక్నాలజీ వచ్చినా, ఎంత భద్రత పెంచినా తమ టెక్నిక్ దెబ్బకు బలాదూర్ అని మహిళా దొంగల ముఠా సవాల్ విసురుతోంది. నరసరావుపేట కేంద్రంగా ఈ ముఠా ప్రయాణికులను మభ్యపెట్టి నగలతో ఉడాయిస్తోంది. పల్నాడు కేంద్రమైన నరసరావుపేట బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. శ్రీశైలం, తిరుపతి, విజయవాడ, అనంతపురం వంటి పట్టణాలకు నరసరావుపేట జంక్షన్‌గా ఉంటుంది. దీంతోపాటు వినుకొండ, మాచర్ల, గురజాల, చిలకలూరిపేట, బాపట్ల జిల్లా సంతమాగులూరు ప్రాంతాల ప్రజలకు విద్య, వ్యాపార సంబంధాలు ఎక్కువగా నరసరావుపేటతో ముడిపడి ఉంటాయి. ఈ క్రమంలో నరసరావుపేట బస్టాండ్‌కు ప్రతి రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. వీరిలో అమాయకులను, ఆదమరిచి ఉన్న వారిని, ఆత్రుత పడే మహిళలను గుర్తించి వారి నగలను దోపిడీ చేస్తున్నారు.



బంగారం అపహరణ కేసులో పోలీసులు అనుమానిస్తున్న మహిళ (సీసీ పుటేజ్)

మాట కలిపితే మూటకు మూడిందే..

ఆ ముఠా మహిళలు బస్టాండ్‌కు వచ్చే వారి బ్యాగుల్లో బంగారు నగలు ఎక్కడ దాచిపెట్టారో గుర్తించి మాట కలుపుతారు. ఆపై సాయం చేస్తున్నట్లు నటిస్తారు. ఆ తరువాత ప్రయాణికులతోపాటు బస్సు ఎక్కుతారు. ప్రయాణికుల సంచుల్లో వీరి సంచుల్లో కలిపేస్తారు. అనంతరం స్టాప్ వచ్చాక బస్సు ఆగి మళ్లీ కదలబోయే సమయంలో ఇక్కడే దిగాలంటూ హడావుడి చేస్తారు. ఈ క్రమంలో ప్రయాణికుల బ్యాగులు మాయం చేస్తారు.

ఇప్పటి వరకు చేసిన దొంగతనాలు..

- శ్రీశైలం ప్రాజెక్ట్ సున్నిపెంట గ్రామానికి చెందిన డాక్టర్ బాడిస శ్రీనివాస్ మార్చి 18న విజయవాడలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యంలో నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఆగింది. టిఫిన్ చేసిన అనంతరం తిరిగి బస్సు ఎక్కాడు. బ్యాగ్ చూసుకోగా అందులో ఉండాల్సిన సుమారు 40 సవర్ల బంగారు అభరణాలు అపహరణకు గురయ్యాయి.
- తాజాగా గురువారం మార్టూరుకు చెందిన మహిళ నరసరావుపేట వచ్చి పని చూసుకొని సొంత గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యింది. నరసరావుపేట బస్టాండ్‌లో చిలకలూరిపేట బస్సు ఎక్కింది. బస్సు కదిలి చిత్రలయా టాకీస్ వద్దకు వెళ్లిందో లేదో ఆమె బ్యాగ్‌లో నగల పర్సు మాయమయ్యింది. పర్సులో సుమారు 10.5 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో దర్యాప్తు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి



నగదు, బంగారు ఆభరణాలతో ప్రయాణాలు కొనసాగించే మహిళలు అప్రమత్తంగా ఉండాలి. గతంలో నరసరావుపేట బస్టాండ్‌లో ప్రయాణికురాలి వద్ద బంగారు ఆభరణాలు చోరి జరిగిన కేసులో చీరాలకు చెందిన మహిళల ముఠాను అరెస్ట్ చేశాం. ప్రయాణించేటప్పుడు అజ్ఞాత వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలి.

– కె. నాగేశ్వరరావు, డీఎస్పీ, నరసరావుపేట

మహిళల ముఠా పనిగా గుర్తింపు..

ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న మహిళ ముఠాను సువర్టుపురం, అనంతపురం జిల్లా వాసులుగా పోలీసులు భావిస్తున్నారు. రద్దీ ఉండే ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతుంటారని చెబుతున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల నుంచి అనుమానిత మహిళల ఫొటోలను పోలీసులు సేకరించారు. బాధితులకు చూపించగా అందులో ఒకరిని గుర్తు పట్టినట్లు సమాచారం.



గందరగోళంగా పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆహార పంపిణీ అస్తవ్యస్తం

ముందు వచ్చిన వాహనాలకు ఫుల్.. వెనకొచ్చిన వాటికి నిల్

యడ్లపాడు: అమరావతి రాజధాని రీ–లాంచ్ కార్యక్రమానికి వివిధ వాహనాల్లో తరలి వెళ్లే ప్రజలకు అధికారులు అందించాల్సిన ఆహార పంపిణీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయ లోపంతో ముందుగా పాయింట్‌కు చేరుకున్న వాహనాల్లో ఫుడ్ ప్యాకెట్లు ఫుల్‌గా, ఆలస్యంగా చేరుకున్న వాటికి కనీసం నీళ్లు కూడా అందుబాటులో లేకుండా పోయాయని ప్రజలు వాపోయారు. బహిరంగ సభకు వెళ్లే ప్రజలకు అల్పాహారం అందించేందుకు జిల్లాలో మూడు పాయింట్లు ఎంపిక చేయగా, వాటిలో ఒకటి యడ్లపాడు గ్రామంలోని ఉప్పవాగు సమీపంలోని హైవే సర్వీసు మార్గంలో ఏర్పాటైంది. ఈ సర్వీసు రోడ్డులో వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాలకు వేర్వేరుగా టెంట్లు వేసి అధికారులు వాటర్‌బాటిల్స్, అరటి కాయలు, పులిహోర, పెరగన్నం సరఫరా చేశారు. ఉదయం 11.30 గంటల తర్వాత ఒక్కసారిగా వచ్చిన బస్సుల్లో వాహనాల నంబర్లు పరిశీలన, డ్రైవర్లు అస్తవ్యస్తంగా బస్సుల్ని నిలిపి వేయడం, ఆయా బస్సుల్లోంచి ఇన్‌చార్జిలతోపాటు జనం కూడా వచ్చి తమ వాహనాల్లోకి అవసరమైన అల్పాహారం, వాటర్ బాటిళ్లను తామే ఎండలో మోసుకువెళ్లక తప్పలేదు. సీఐ, ఎస్‌లు ట్రాఫిక్ సరళీకృతం చేసే పనుల్లో ఉండగా స్టాళ్ల వద్ద కానిస్టేబుల్స్ లేకపోవడంతో తోపులాట జరిగింది. అధికారులు, వాహనాల్లో వచ్చిన పార్టీనేతల మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఇలా 1.30 గంటల తర్వాత వాహనాలకు మాత్రం ఆహారం అందలేదంటూ ఆయా వాహనాల్లోని ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక అధికారులు రాత్రి వేసిన టెంట్లు శుక్రవారం తెల్లవారుజామున వచ్చిన గాలులకు పడిపోయాయి. పడిన వాటినే సరిచేసుకుని అందులోనే సర్దుకుని పంపిణీ ప్రక్రియను కొనసాగించారు.

అర్ధాకలితో వెనుతిరిగిన ప్రజలు

పెదకూరపాడు: రాజధాని పునఃనిర్మాణం సభకు వెళ్లిన ప్రజలు ఆకలితో అల్లాడారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పల్నాడు ప్రాంతం నుంచి వచ్చిన ప్రజానీకానికి ఆహార పొట్లాలతో పాటు మజ్జిగ అందిస్తామని చెప్పారు. సభకు వెళ్లే సమయంలో పులిహోర అందించారు. మండుటెండలో పులిహోర తినలేక కింద పడేశారు. అమరావతిలోని కాలచక్ర రహదారిలో వాహనాలు నిలిపి పల్నాడు జిల్లా మాచర్ల, గురజాల, సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలు ఆహారం కోసం వెతుకులాట మొదలు పెట్టారు. పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన ఆహారం పంపిణీ పాయింట్ల వద్ద ఆహారం లేదు, మంచినీరు కావాలంటే ఆపండంటూ ప్రచారం చేయడంతో సభకు వెళ్లిన ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మాచర్ల వెళ్లాలంటే అర్ధరాత్రి అవుతుందని, ఆహారం లేకుండా అప్పటి వరకు ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

గాలివాన బీభత్సం



బుడగ జంగాల కాలనీలో రోడ్డుపై పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



వెంకటాయపాలెంలో నేలవాలిన మునగతోటను చూపుతున్న రైతు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. ఉదయం 3 గంటల నుంచి 5 గంటల వరకు భారీగా ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలుల వల్ల మండల కేంద్రమైన బెల్లంకొండ ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ప్రాథమిక పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం విరిగి స్కూల్ ఆవరణలో పడింది. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో గాలులకు పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు ఇళ్లపై పడి నానా బీభత్సం సృష్టించాయి. కోత కోసిన మిరప పంట కల్లాల్లో ఉండడంతో కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. కాయ దశలో ఉన్న మునగ తోటలు నేలకొరిగాయి. బొప్పాయి తోటల్లో కాయలు నేలరాలిపోయాయి. చేతికి అంది వచ్చిన పంట వర్షం ధాటికి నోటి కందకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని గిరిజన సంక్షేమ పాఠశాలలో (బాలురు) 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి (ఇంగ్లిష్ మీడియం) వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ గుమ్మడి వీరయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. 5వ తరగతిలో 40 సీట్లు ఉండగా వీటిలో 30 సీట్లు ఎస్టీలకు కేటాయించినట్టు తెలిపారు. మిగిలిన 10 సీట్లలో ఐదు సీట్లు ఎస్సీ, బీసీ 2, ఓసీ 1, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఒక సీటు కేటాయించారన్నారు. 6వ తరగతిలో 25, 7వ తరగతిలో 17, 8వ తరగతిలో 24, 9వ తరగతిలో 13 సీట్లు ఉన్నాయని, వాటిని ఎస్టీ సామాజిక వర్గం విద్యార్థులతో భర్తీ చేయనున్నట్టు వివరించారు. 5 నుంచి 9వ తరగతి వరకు మిగులు ఖాళీలను ఎస్టీ విద్యార్థులతోనే భర్తీ చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదని తెలిపారు. పాఠశాలలోని ఖాళీల సంఖ్య కన్నా ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లయితే జిల్లా ట్రైబల్ సంక్షేమశాఖ అధికారుల సమక్షంలో ఈనెల 30వ తేదీన లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామని వివరించారు. వివరాలకు 6301318855 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్‌పై అక్రమ కేసు



యాక్టివిస్ట్ షేక్ మాబు

పిడుగురాళ్ల: సోషల్ మీడియా యాక్టివిస్టు షేక్ మాబును అక్రమ కేసులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మాబు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడనే నెపంతోనే కూటమి నాయకులు పోలీసుల చేత అక్రమంగా అరెస్టు చేయించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 2024 సెప్టెంబర్ 11న సోషల్ మీడియా యాక్టివిస్టు వెన్నా రాజశేఖర్ రెడ్డి, మాబుని అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు ఇబ్బందులు గురి చేశారు. ఈ సమయంలో మాబు తల్లిదండ్రులు హైకోర్టులో హెబీఎస్ కార్పస్ వేశారు. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని కొంత కాలంగా వెన్నా రాజశేఖర్‌రెడ్డిని, మాబుని ఇబ్బందులు పెడుతూ వచ్చారు. పిడుగురాళ్ల పోలీసులు ఈ క్రమంలోనే తిరిగి బైకు దొంగతనం చేశారన్న నెపంతో మాబుని బ్రాహ్మణపల్లిలోని సిమెంట్ షాపు వద్ద నుంచి కొట్టుకుంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అన్నను ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందని, పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావును మాబు తమ్ముడు జానీ ప్రశ్నించారు. దాంతో బైకు దొంగతనం కేసు సంబంధించి విచారణకు తీసుకొని వచ్చామని తెలిపారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్ అనే కారణంతోనే ఈ అక్రమ కేసులు బనాయించి తన అన్న మాబును పోలీస్‌స్టేషన్‌కు తరలించారని జానీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావును సాక్షి వివరణ కొరగా మాబుతోపాటు అతని అన్న బైక్ దొంగతనం కేసులో అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినట్లు సీఐ తెలిపారు.

పంతం నెగ్గించుకున్న కోడెల వర్గీయులు

- ప్రభుత్వ హాస్పిటల్‌లో కోడెల విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న మంత్రి రవి, చీఫ్‌విప్ జీవీ, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు
- అనుమతులపై స్పష్టత కరవు



కోడెల విగ్రహావిష్కరణలో మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో శాసనసభ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆవిష్కరించాలనే పంతాన్ని ఆయన వర్గీయులు నెగ్గించుకున్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా విగ్రహాన్ని కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కోడెల తనయుడు శివరాం పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన సభలో కోడెల రాష్ట్రానికి, నియోజకవర్గానికి చేసిన సేవలను కొనియాడారు.

గతంలో ఎమ్మెల్యే అభ్యంతరంతో వివాదం

ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే గతేడాది ఒక అర్ధరాత్రి దిమ్మెను నిర్మించి కోడెల విగ్రహాన్ని నిలబెట్టారు. స్థానిక ఎమ్మెల్యే చేసిన అభ్యంతరాల మేరకు విగ్రహావిష్కరణ ఆగిపోయింది. సుమారు రెండు నెలలపాటు విగ్రహావిష్కరణ జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అప్పటి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్ ఆదేశాలతో సిబ్బంది దిమ్మె పైనుంచి విగ్రహాన్ని తొలగించి సురక్షితంగా హాస్పిటల్ ఆవరణలో ఉంచారు. దీనిపై కోడెల వర్గీయులు ఆందోళన చేసి సూపరింటెండెంట్ కార్యాలయాన్ని దిగ్బంధించారు. స్థానిక ఎమ్మెల్యే చేసిన సూచనల మేరకే విగ్రహాన్ని తొలగించానని సూపరింటెండెంట్ చెప్పారు. అనంతరం ఆయన తన పదవిని కోల్పోవాల్సి వచ్చింది. చివరకు కోడెల శివరామ్ పట్టుబట్టడంతో విగ్రహావిష్కరణకు నాయకులు పూనుకున్నట్లు తెలియవచ్చింది. అనుమతులు ఎవరు ఇచ్చారనే దానిపై స్పష్టతలేదు.

సొమ్ము ఒకరిది..సోకు మరొకరిది..

2014–19లో కేంద్ర ప్రభుత్వ సంస్థ నాబార్డు అందజేసిన నిధులతో ఆస్పత్రి ఒక భవనాన్ని అసంపూర్తిగా నిర్మించి ఎన్నికలు దగ్గర పడటంతో కోడెల శివప్రసాదరావు ప్రారంభించారు. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కృషితో వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని సందర్శించి సుమారు రూ.3.5కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ నిధులతో ర్యాంపు నిర్మాణం, తాగునీటి వసతి, హాస్పిటల్ చుట్టూ ప్రహరీ, సెప్టిక్ ట్యాంకు, హాస్పిటల్ కావాల్సిన మౌలిక సదుపాయాలన్ని ఏర్పాటుచేసి మళ్లీ పున ప్రారంభించారు. డాక్టర్ గోపిరెడ్డి దాతల సహకారంతో సుమారు రూ.1.5 లక్షల నిధులు సమకూర్చి హాస్పిటల్‌ను పటిష్టపర్చారు. ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారి రెండు దశల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, ప్రకాశం జిల్లాకు చెందిన సుమారు 5వేల మందికి వైద్యసేవలు ఈ వైద్యశాల ద్వారా అందాయి. ఎంతోమంది జీవితాలను నిలబెట్టారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే వెంటనే హాస్పిటల్ పేరును అనధికారికంగా కోడెల పేరు తగిలించి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయటం గమనార్హం.

'నీట్'కు విస్తృత ఏర్పాట్లు

- గుంటూరు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు
- దరఖాస్తు చేసిన విద్యార్థులు 4,250 మంది
- ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి
- మధ్యాహ్నం 1.30 గంటల తరువాత నో ఎంట్రీ

గుంటూరుఎడ్యుకేషన్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికై ఆదివారం జరగనున్న జాతీయస్థాయి అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్–2025)కు విస్తృత రీతిలో ఏర్పాట్లు చేస్తు న్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,250 మంది విద్యార్థులకు 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరగనుంది. పరీక్షా కేంద్రాల వద్ద నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిబంధనల మేరకు ప్రతి ఒక్క విద్యార్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉండటంతో విద్యార్థులు ఉద యం 11 గంటల కల్లా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. మధ్యాహ్నం 1.30 తరువాత కేంద్రాల్లోనికి అనుమతించరు. నీట్ దరఖాస్తు సమయంలో అందజేసిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్‌లో పొందుపర్చిన నియమావళిని విధిగా పాటించాల్సి ఉంది.



విద్యార్థుల వస్త్రధారణపై ఆంక్షలు

- నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల వస్త్రధారణపై ఎన్‌టీఏ ఆంక్షలు విధించింది. విద్యార్థినులు ముక్కుపుడక సహా చెవులకు దిద్దులు, చేతులకు గాజుల సహా ఎటువంటి ఆభరణాలను ధరించరాదు.
- చేతికి స్మార్ట్‌వాచీతోపాటు సాధారణ వాచీలను సైతం ధరించకూడదు.
- సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా కేంద్రాల్లో గడియారాలను ఏర్పాటు చేస్తున్నారు.
- విద్యార్థులు జీన్స్ ప్యాంట్లు వంటి వస్త్రాలను ధరించకుండా, సాధారణ దుస్తుల్లోనే రావాల్సి ఉంది. తలకు టోపీ, కళ్లకు బ్లాక్ సన్‌గ్లాసెస్ ధరించకూడదు.
- బ్లూటూత్ వాచీలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌బ్యాండ్లు, పెన్నులు సహా ఇతర ఎటువంటి వస్తువులను తమ వెంట తీసుకురాకూడదు.

విద్యార్థులు వీటిని వెంట తెచ్చుకోవాలి

- విద్యార్థులు ప్రింటవుట్ అడ్మిట్‌కార్డుతో పాటు నీట్ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తమ వెంట తెచ్చుకోవాలి. మరొక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను ఎగ్జామినేషన్ హాల్లో విద్యార్థుల హాజరు నమోదు చేసే సమయంలో అటెండెన్స్ షీట్‌పై అతికించాల్సి ఉంది. దీంతో పాటు పోస్ట్‌కార్డ్ సైజు వైట్ బ్యాక్ గ్రౌండ్‌తో కూడిన కలర్ ఫొటోను అడ్మిట్‌కార్డుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై అతికించి ఇన్విజిలేటర్‌కు అందజేయాలని నియమావళిలో పొందుపర్చారు.
- ప్రభుత్వం జారీ చేసిన ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, 12వ తరగతి అడ్మిషన్ కార్డులో ఏదో ఒక ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకెళ్లాలి. శారీరక వైకల్యం గల విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకెళ్లాలి. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. పరీక్ష రాసేందుకు అవసరమైన పెన్నులను కేంద్రాల్లోనే ఇస్తారు.

క్లుప్తంగా

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.10 అడుగుల వద్ద ఉంది. ఇది 138.7364 టీఎంసీలకు సమానం.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో 1098 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 836, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,400. గరిష్ట ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,000 పలికింది. కాయలు 262, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,400. గరిష్ట ధర రూ.11,350, మోడల్ ధర రూ.11,000 పలికింది. మొత్తం 823.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

బెదిరింపు కేసులో జైలు, జరిమానా

నరసరావుపేట టౌన్ : మద్యం మత్తులో భార్య, అత్తమామలను దూషించటంతో పాటు దాడి చేసి బెదిరించినట్లు నేరం అంగీకరించడంతో నిందితుడికి నెల జైలు శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆవుల సలోమి శుక్రవారం తీర్పు చెప్పారు. 2024 మే 7వ తేదీన భార్య ప్రసవించగా చూసి వెళ్ళటానికి వచ్చిన రామిరెడ్డిపేటకు చెందిన ఆవుల కోటిరెడ్డి మద్యం తాగి అత్త, మామలతో పాటు భార్యను దూషించి వారిపై దాడి చేసి బెదిరించాడు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో నేరం అంగీకరించటంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



రేపల్లె : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో సుచిత్ర చెప్పారు. బాపట్ల జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని శివాజీ మున్సిపల్ స్కూల్లో కిశోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను గ్రామీణులకు తెలియజెప్పాలన్నారు. యువతికి 18 , యువకుడికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలనే దిశగా అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమన్నారు. రూ. లక్ష జరిమానా రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాంచారమ్మ, వెంకట రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు శిక్షపడే వరకు పోరాటం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: సోషల్ మీడియా యాక్టివిస్టులను కొట్టిన పోలీసులకు శిక్ష పడే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్న బ్రాహ్మణపల్లి సర్పంచ్ కుమారుడైన మాబుపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని ఖండించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్నాడనే కారణంతోనే ఆరు, ఏడు నెలల కిందట మాబుపై, సోషల్ మీడియా గురజాల నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డిపై పోలీసులు కేసులు పెట్టి కొట్టారని ఆరోపించారు. దానిమీద అప్పుడే హెబియస్‌కార్పస్ వేశామని, హైకోర్టులో పోలీసుల మీద కేసులు కూడా వేసినట్లు తెలిపారు. అప్పుడు హైకోర్టు కూడా లోయర్ కోర్టులో సమస్యలు, జరిగిన దురాగతాలను మెజిస్ట్రేట్ ముందు రికార్డు చేయాలని 10 రోజుల కిందట తీర్పు వచ్చిందని వివరించారు. వీరు జడ్జి ముందు ఏమైనా చెబుతారోమెనని అక్రమంగా బెదిరించటానికి మరొక దొంగ కేసును అన్నదమ్ములు ఇద్దరి మీద పెట్టారని కాసు వివరించారు. ఇద్దరూ జగన్‌మోహన్‌రెడ్డి సైనికులు కావడంతో పోలీసులు ఎన్ని అక్రమ కేసులుపెట్టినా, కొట్టినా ఆదరకుండా, బెదరకుండా ఉన్నారని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా న్యాయ పోరాటం చేస్తామని ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు.పోలీస్‌స్టేషన్ ముట్టడి కోసం నాయకులు, కార్యకర్తలతో సిద్ధమయ్యామని, అయితే పోలీసులు మాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిస్తామని చెప్పారు. దీంతో కోర్టులోనే న్యాయపరంగా తెల్చుకుంటామని కాసు స్పష్టం చేశారు. ఏది ఏమైనా హైకోర్టు ఇచ్చిన డైరెక్షన్‌పై వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాస రావు, కేవీ, చల్లా పిచ్చిరెడ్డి, చింతా సుబ్బారెడ్డి, బ్రాహ్మణపల్లి సర్పంచ్ బడేసా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల వచ్చిన సుబ్బారెడ్డి



అక్రమ అరెస్టు గురించి సుబ్బారెడ్డికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం రాత్రి వచ్చారు. అనంతరం పార్టీ నేత అల్లు పిచ్చిరెడ్డి కుమారుడి వివాహానికి హాజరయ్యారు. ఈ క్రమంలోనే గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆహ్వానం మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. వీరిని కాసు మహేష్‌రెడ్డి దుశ్శాలువాలతో సన్మానించారు. కొంతసేపు ఈ ప్రాంత రాజకీయాల గురించి సంభాషించారు. బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కుమారుడు మాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా యాక్టివిస్టుగా చురుకుగా పని చేస్తుండటంతో పోలీసులు అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాసు మహేష్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు

చీరాల రూరల్: క్రీడలతో మానసిక వికాసం కలగడమే కాకుండా ధృడ సంకల్పం సిద్ధిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల ఎన్‌ఆర్అండ్‌పిఎం హైస్కూలు క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ (9 ప్లస్ 3) పోటీలు ప్రారంభించారు. రాష్ట్రంలోని 16 క్రీడా జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు నూతలపాటి విజయకుమార్ (దాసు) తెలిపారు. చీరాలతోపాటు ఒంగోలు, గుంటూరు, విజయవాడ, ఏలూరు, నెల్లూరు, తిరుపతి, కాకినాడ, హైదరాబాదు, విశాఖపట్టణం వంటి నగరాల జట్లు వచ్చాయని తెలిపారు. పోటీల మొదటి రోజు మూడు జట్ల క్రీడాకారులు తలపడ్డారు. మొదటగా చీరాల ఎడ్విన్ మెమోరియల్ జట్టు కాకినాడ జట్లు క్రీడాకారులు తలపడగా 3–1 స్కోరు తేడాతో చీరాల ఎడ్విన్ మెమోరియల్ జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో విశాఖపట్టణం శ్రీధర్ ఫుట్‌బాల్ జట్టు వర్సెస్ యునైటెడ్ లియోస్ జట్టు క్రీడాకారులు తలపడ్డారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో 3–1 స్కోర్ తేడాతో విశాఖపట్టణం శ్రీధర్ ఫుల్‌బాల్ క్లబ్ జట్టు గెలుపొందింది. రూ. 50,000, రూ. 30,000, రూ. 20,000 వరుస బహుమతులుగా అందజేయనున్నారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ అబ్రహం బ్లెస్సీ, ఎస్ఎంఎల్‌జే కాలేజీ ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, మున్సిపల్ కౌన్సిలర్ సల్లూరి సత్యానందం, ఆర్గనైజర్ నూతలపాటి విజయకుమార్ (దాసు), అంపైర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చీరాల టౌన్: పశుపోషకులు తమ జీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాడి పరిశ్రమలో అభివృద్ధి సాధించాలని పశువైద్యురాలు పావని సూచించారు. మంగళవారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గేదెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్ దాణా పంపిణీ చేశారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ పశుపోషకుల సంక్షేమం, పశువులు ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్లను రద్దు చేశామని డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైలు నంబర్ 57201 విజయవాడ–గుంటూరు, 57203 గుంటూరు–మాచర్ల, 57206 మాచర్ల–నడికుడి, 57205 నడికుడి–మాచర్ల, 57204 మాచర్ల–గుంటూరు, 57202 గుంటూరు–విజయవాడ, 6779 కాచిగూడు–నడికుడి, 67780 నడికుడి–కాచిగూడ రైళ్లు ఈ నెల 3, 4, 5 వ తేదీలలో రద్దు అయినట్లు తెలిపారు. ప్రయాణికులు దీనిని గమనించి సహకరించాల్సిందిగా తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో తీర్పు

గుంటూరు లీగల్: పల్నాడు జిల్లా గురజాల మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన పేరం వెంకటరెడ్డి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా 2018లో విద్యుత్ చౌర్య నియంత్రణాధికారి దాడి జరిపి, ఆయన్ను అరెస్టు చేశారు. విచారణలో 2,690 వాట్స్ అక్రమంగా విద్యుత్ వినియోగించడం వలన సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకి రూ. 44,859 నష్టం కలిగించినట్లు తేలింది. దీనిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా 1వ జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి విచారణ చేపట్టారు. నేరం చేసినట్లు నిర్ధారించి, గతంలో కూడా ముద్దాయి ఇదే నేరానికి పాల్పాడి నేరం అంగీకరించినందున రూ. 2.70 లక్షల జరిమానా విధించారు. ఈ మొత్తం కట్టని పక్షంలో నాలుగు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వజ్రాల రాజశేఖర్ రెడ్డి తన వాదనలు వినిపించారు.

వైఎస్సార్ సీపీలో నియామకాలు

తాడికొండ: తాడికొండ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షురాలిగా కసుకుర్తి దెబోరా, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా పూసపాటి వెంకట రామిరెడ్డిలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నెల 30వ తేదీన ఉత్తర్వులు వెలువరిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కష్ట పడి పని చేస్తామని పేర్కొన్నారు.

తైక్వాండో పోటీల్లో బాలిక సత్తా



చీరాల రూరల్: జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో చీరాల వెదుళ్లపల్లికి చెందిన రాజు ఆకాంక్షరెడ్డి 29 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఫస్ట్ ఫెడరేషన్ కప్ సీపీయూ తైక్వాండో జాతీయస్థాయి చాంపియన్ షిప్–2025 పోటీలు గతనెల 30న డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నాసిక్‌లో నిర్వహించారు. చీరాల తైక్వాండో కోచ్ మల్లెల సురేష్ ఆధ్వర్యంలో శిక్షణ పొంతుతున్న బాపట్లలోని జేమ్స్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న వెదుళ్లపల్లికి చెందిన రాజు ఆకాంక్ష రెడ్డి 29 కేజీల విభాగంలో పాల్గొంది. తన ప్రత్యర్థిని చిత్తుచేసి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకుంది. మన రాష్ట్రంతోపాటు చీరాల ప్రతిష్టను ఇనుమడింపచేసింది. కోచ్ సురేష్ ఆధ్వర్యంలో క్రీడాకారిణి ఆకాంక్ష రెడ్డి చీరాల ఒన్‌టౌన్ సీఐ సుబ్బారావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆకాంక్ష రెడ్డి, కోచ్ సురేష్‌ను మెమోంటో‌తో అందజేసి ఘనంగా సత్కరించారు. అంతేకాక పలువురు క్రీడాభిమానులు, క్రీడా ప్రేమికులు వారిని అభినందించారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



సీతారామరాజుకు బ్యాగు అప్పగిస్తున్న ఎస్ఐ

పర్చూరు(చినగంజాం): స్థానిక అమ్మ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ చేసేందుకు వచ్చి క్యాష్ బ్యాగును మరచిపోయి వెళ్లిపోయిన వ్యక్తికి అదే దుకాణంలో పని చేస్తున్న వ్యక్తి ఆ నగదు తిరిగి అప్పగించాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పొన్నూరు గ్రామానికి చెందిన డొక్కు సీతారామరాజు మొక్కజొన్న ట్రేడింగ్‌కు సంబంధించిన రూ 1.80 లక్షల నగదు ఉన్న బ్యాగు దుకాణంలో మరచి పోయి వెళ్లిపోయాడు. అమ్మ టిఫిన్ సెంటర్‌లో వర్కర్‌గా పని చేస్తున్న ఆలపాటి ప్రసాద్ సీతారామరాజు బ్యాగును గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాల్యాద్రికి అప్పగించాడు. సీతారామరాజుకు విషయం తెలియజేసి , స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సమక్షంలో అతని క్యాష్ బ్యాగును అప్పగించారు. టిఫిన్ సెంటర్ వర్కర్ ప్రసాద్ నిజాయితీని పలువురు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి హౌస్ అరెస్ట్



మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

లక్ష్మీపురం: ప్రధాని నరేంద్ర మోదీ రాజధాని పునఃప్రారంభానికి విచ్చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు షేక్ మస్తాన్ వలిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎవరూ స్పందించలేదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో అమరావతికి వచ్చిన సమయంలో ప్రధాని మోదీ గుప్పెడు మట్టి, పాచి పోయిన లడ్డు, చెంబులో నీరు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సారి వచ్చి అందరిని యోగా చేయాలని సూచించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు హౌస్ అరెస్టులు సరి కాదని తెలిపారు.

తల్లీబిడ్డ వాహనాల డ్రైవర్ల నిరసన

- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

నరసరావుపేట: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారంనిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాంబశివరావు మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి నెలకు జీతం రూ.8800 మాత్రమే ఇస్తున్నారని, పీఎఫ్ వాటా కూడా డ్రైవర్ల వేతనాల నుంచి మినహాయిస్తున్నారని తెలిపారు. తమను కూడా ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు డ్రైవర్లు కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ సిలార్ రసూల్ మాట్లాడుతూ బాలింతను వాహనంలో ఎక్కించుకున్నప్పుడు, ఆమెను ఇంటి దగ్గర దించాక యాప్ ద్వారా ఫొటో అప్లోడ్ చేసే క్రమంలో అది సక్రమంగా పనిచేయక డ్రైవర్లు పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. వారాంతపు, పండుగ సెలవులు, ఇంక్రిమెంట్లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాల్ని చట్టప్రకారం అమలు చేయాలని కోరారు. సిబ్బందిని ఏజెన్సీ ద్వారా నియమించినా ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్నట్లు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓ లీలా కుమారికి వినతిపత్రం అందజేశారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

ప్రశ్నించే వారి గొంతు నులిమేస్తే ఎలా?



సత్తెనపల్లిలో అవ్వారు ప్రసాదరావును హౌస్ అరెస్ట్ చేసి కాపలా ఉన్న పోలీసులు

- భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు హౌస్ అరెస్ట్
- ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలీసులు నిర్బంధం

సత్తెనపల్లి: ప్రజా సమస్యలు పరిష్కరించకుండా .. వాటిని కనీసం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లకుండా ప్రశ్నించే వారి గొంతు నులిమేస్తే సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందని భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆవ్వారు ప్రసాదరావు ప్రశ్నించారు. అమరావతి రాజధానికి మోదీ వస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి ప్రసాదరావును అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేశారు. గురువారం రాత్రి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన ఆ రోజు అందుబాటులో లేరు. శుక్రవారం పోలీసులు పలు ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానం చెప్పినప్పటికీ సంతృప్తి చెందలేదు. ఇద్దరు కానిస్టేబుల్‌లను ఇంటి వద్ద ఉంచి ప్రసాదరావును గృహ నిర్బంధం చేశారు. దీన్ని ఆయన ప్రశ్నించారు. మోదీ సభ పూర్తయ్యే వరకు నిర్బంధం తప్పదని పోలీసులు తేల్చి చెప్పారు. శుక్రవారం రాత్రి 7:30 గంటలకు పోలీసులు వెళ్లిపోవడంతో ఆయన బయటికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '' మేము ఏమైనా దొంగలమా.. దోపిడీలు, మర్డర్లు చేశామా..మరి ఎందుకు గృహ నిర్బంధం చేశార''ని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలకులు వాస్తవాలను గమనించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. గృహ నిర్బంధాలు చేసినంత మాత్రాన ప్రయోజనం లేదని, దీనికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

సీపీఎం నాయకుల హౌస్ అరెస్టులు హేయం

సత్తెనపల్లి: మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని పునః నిర్మాణం ప్రారంభం కోసం వస్తున్న నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని సీపీఎం నాయకులను పట్టణ పోలీసులు హౌస్ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి సీపీఎం వ్యతిరేకం కాదని, రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావుకు కూడా ఆహ్వానం పంపారని తెలిపారు. కానీ సభకు వెళ్లవద్దంటూ నాయకులను ఎలా అరెస్టు చేస్తారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాత్రి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు అవ్వారు ప్రసాదరావు ఇంటిని పోలీసులు సోదా చేయడాన్ని ఆయన ఖండించారు. ఆయన్ను హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సత్తెనపల్లి రూరల్ సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, ముప్పాళ్ల మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ ఇళ్ల వద్ద, సీపీఎం కార్యాలయం వద్ద పోలీసులను పెట్టి హౌస్ అరెస్టులు చేయడాన్ని దుయ్యబట్టారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్ని కేంద్రం నుంచి అప్పుగా కాకుండా గ్రాంట్‌గా రాబట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు జడ రాజకుమార్, ఎం. హరిపోతురాజులు పాల్గొన్నారు.

వైభవంగా నాటికల పోటీలు ప్రారంభం



గంగోత్రి సాయికి సవ్యసాచి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో ఉభయ రాష్ట్రస్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం రాత్రి వైభవంగా ఆరంభమయ్యాయి. గ్రామంలోని చిన్న రథశాల వద్ద ప్రత్యేక వేదిక గద్దె శివరావు కళాప్రాంగణంలో ఏర్పాటైన నాటికల పోటీలను కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు వైఎస్‌కే ఎన్ స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్, ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ జ్యోతిప్రజ్వలనతో ఆరంభించారు. సభకు పొన్నూరు కళాపరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ.. ఆంధ్రాప్యారిస్ తెనాలి కళల కాణాచిగా వర్థిల్లితే, ఎందరో కళాకారులకు జన్మనిచ్చిన పుణ్యభూమి కొలకలూరు అని చెప్పారు. వల్లూరు వెంకట్రామయ్య, మోదుకూరి జాన్సన్, డీఎస్ దీక్షిత్ వంటి నాటక రంగ ప్రముఖులు, ఎందరో సాహితీవేత్తలు కొలకలూరు నుంచి ఉద్భవించారని సోదాహరణంగా చెప్పారు. ఏటా నాటికల పోటీలను నిర్వహిస్తూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడిన నాటకరంగ ప్రముఖుల పేరుతో అవార్డులను ప్రదానం చేస్తున్న శ్రీసాయి ఆర్ట్స్ సంస్థ నిర్వాహకులు అభినందనీయులని చెప్పారు. ఇదే వేదికపై తాడేపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, నాటక సంస్థ నిర్వాహకుడు గంగోత్రి సాయికి నటుడు, దర్శకుడు కరణం సురేష్ జ్ఞాపకార్థం ప్రదానం చేసి సవ్యసాచి అవార్డును బహూకరించారు. ప్రముఖ సంగీత దర్శకుడు తుమ్మల సాంబశివరావు స్మారకంగా మరో సంగీత దర్శకుడు పి.లీలామోహనరావును సత్కరించారు. వరగాని పరిషత్ అధ్యక్షుడు పోపూరి నాగేశ్వరరావు, ఎన్టీఆర్ కళాపరిషత్, అనంతవరం అధ్యక్షుడు గుదె పాండురంగారావు, కొండవీటి కళాపరిషత్, లింగారావుపాలెం అధ్యక్షుడు కట్టా శ్రీహరి, ఎన్టీఆర్ కళాపరిషత్, వినుకొండ అధ్యక్షుడు కూచి రామాంజనేయులు, కళాంజలి, చీరాల కార్యదర్శి తిరుమలశెట్టి సాంబశివరావు మాట్లాడారు. నిర్వాహక సంస్థల అధినేతలు, రంగస్థల, సినీ నటులు గోపరాజు రమణ, గోపరాజు విజయ్, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.



లీలామోహనరావుకు తుమ్మల సాంబశివరావు స్మారక సత్కారం చేస్తున్న నిర్వాహకులు

ప్రధాని మోదీ సభకు 11 బస్సులు



కారంచేడు: అమరావతి పునఃప్రారంభోత్స కార్యక్రమానికి ప్రజలకు చేరవేసేందుకు ప్రభుత్వం 11 బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల ద్వారా 480 మందిని సభకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ఈ బస్సులను మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా సహకార శాఖ అధికారి సీహెచ్ శ్యాంసన్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి బస్సుకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. బస్సుల్లో ఏఎన్ఎంలు, ఆశలు, మహిళా పోలీసులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ జి.నాగరాజు, ఎంపీడీఓ కె.నేతాజీ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.